సాక్షి అనకాపల్లి

శనివారం । 25 । మార్చి । 2023



రోడ్డుకు మోక్షం

దేవరాపల్లి మండలంలోని కాశీపురం నుంచి గవరవరం వెళ్లే రోడ్డు విస్తరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. 8లో



క్షయ వ్యాధి నివారణకు కృషి

క్షయవ్యాధి అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. 8లో

వర్షసూచన

అనకాపల్లిటౌన్: రాగల ఐదు రోజులు ఓమోస్తరు వర్ష కురిసే అవకాశం ఉందని స్థానిక ఆర్ఏఆర్ఎస్ వాతావరణవిభాగం శాస్త్రవేత్త కుమారి పేర్కొన్నారు. ఈనెల 25న 6, 26న 6, 27న 2, 28న 2, 29న 15 మిల్లీమీటర్ల వర్షపాతం నమోదవుతుందని, ఉష్ణోగ్రతలు 32.6 నుంచి 32.8 డిగ్రీలు, గాలి 6 నుంచి 8కిలోమీటర్ల వేగంతో వీస్తుందని తెలిపారు.

రంజాన్ వేళలు

అనకాపల్లి
ఇఫ్తార్ (శని) 6-12 సహర్ (ఆది) 4-43

నర్సీపట్నం
ఇఫ్తార్ (శని) 6-16 సహర్ (ఆది) 4-42

నేడే మహా బడ్జెట్

జీవీఎంసీ సర్వ సభ్య (ప్రత్యేక) బడ్జెట్ సమావేశం శనివారం జరగనుంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్నారు. 8లో



బడ్జెట్ అంచనాలివీ..

ప్రారంభ నిల్వ
రూ. 48,058.32 లక్షలు

వివిధ పద్దుల కింద జమలు
రూ. 3,82,262.50 లక్షలు

ప్రారంభ నిల్వతో కలిపి మొత్తం జమలు
రూ. 4,30, 320.82 లక్షలు

అన్ని పద్దుల కింద ఖర్చులు
రూ. 4,06,349 లక్షలు

ముగింపు నిల్వ
రూ. 23,971.82 లక్షలు

దుమ్ములేపిన దబాంగ్

- ఆసక్తిగా సాగిన సీసీఎల్ తొలి సెమీ ఫైనల్
- విశాఖ వైఎస్సార్ స్టేడియంలో తారల సందడి

- 8లో



ఏజెంట్ చిత్రంలోని పాటను విడుదల చేస్తున్న అఖిల్, సాక్షి విద్య

వెదురు సోయగం

- జీ-20కి వెదురుతో ఆకృతులు
- మైదుకూరులో రూపుదిద్దుకున్న బాస్కెట్లు, పోల్స్, తబలాలు
- ఇప్పటికే నగరానికి చేరుకున్న బ్యాంబూ ఉత్పత్తులు
- వీటిపై పూణే, కడియంల నుంచి రప్పిస్తున్న పూలమొక్కలు
- విశాఖ రోడ్లకిరువైపులా విరబూయనున్న అందాలు
- ఈ తరహా రాష్ట్రంలో ఇదే తొలిసారి

- 8లో



న్యూస్‌రీల్

ఇంటర్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థుల డిబార్

విశాఖ విద్య: ఇంటర్మీడియెట్ పరీక్షల్లో ఇద్దరు విద్యార్థులు డిబార్ అయ్యారు. శుక్రవారం విశాఖ, అనకాపల్లి, అల్లూరి సీతారామరాజు జిల్లాలో పరిధిలో 128 కేంద్రాల ద్వారా జనరల్, ఒకేషనల్ కోర్సులు కలిపి 49,373 మంది విద్యార్థులు పరీక్షకు హాజరుకావాల్సి ఉండగా, 48,346 మంది హాజరయ్యారు. దీంతో 97.92 శాతం హాజరు నమోదైనట్లు ఇంటర్మీడియెట్ బోర్డు ప్రాంతీయ పర్యవేక్షణాధికారి పి.ఉమారాణి తెలిపారు. అల్లూరి సీతారామరాజు జిల్లాలోని అరకులోని ఏపీటీడబ్ల్యూఆర్ఎస్ కేంద్రంలో ఇద్దరు విద్యార్థులు మాల్ ప్రాక్టీస్‌కు పాల్పడుతూ పట్టుబడ్డారు. తనిఖీ నిమిత్తం వెళ్లిన ఫ్లయింగ్ స్క్వాడ్ బృందం మాల్ ప్రాక్టీస్‌ను గుర్తించి, ఆ ఇద్దరు విద్యార్థులను డిబార్ చేసినట్లు ఆర్ఐవో ఉమారాణి వెల్లడించారు. ఉమ్మడి విశాఖ జిల్లాలోని అన్ని కేంద్రాల్లో పరీక్షలు ప్రశాంత వాతావరణంలో జరుగుతున్నట్లు ఆమె తెలిపారు.

30న తపాలా అదాలత్

అనకాపల్లిటౌన్ : స్థానిక పోస్టల్ కార్యాలయంలో ఈ నెల 30న డివిజన్ పరిధి 9వ తపాలా అదాలత్ నిర్వహించనున్నట్టు ఆ శాఖ సూపరింటెండెంట్ కె.ప్రసాద్‌బాబు శుక్రవారం ఓ ప్రకటనలో తెలిపారు. తపాలా సేవలకు సంబంధించి ప్రత్యేక, వ్యక్తిగత ఫిర్యాదులు మాత్రమే అదాలత్‌లో చర్చిస్తామన్నారు. డివిజన్ పరిధిలోని తపాలా వినియోగదారులు ఈ నెల 29లోపు సూపరింటెండెంట్ కార్యాలయంలో తమ అర్జీలను అందించాలని సూచించారు.

నేడు విద్యుత్ టారిఫ్ విడుదల

సాక్షి, విశాఖపట్నం: 2023-24 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి విద్యుత్ చార్జీల ఉత్తర్వులను రాష్ట్ర విద్యుత్ నియంత్రణా మండలి (ఏపీఈఆర్‌సీ) చైర్మన్ జస్టిస్ సి.వి.నాగార్జునరెడ్డి శనివారం విడుదల చేయనున్నట్లు ఏపీఈపీడీసీఎల్ సీఎండీ కె.సంతోషరావు పేర్కొన్నారు. సీతమ్మధారలోని సంస్థ కార్పొరేట్ కార్యాలయంలో ఏటీసీ భవన కాన్ఫరెన్స్ హాల్లో శనివారం ఉదయం 11 గంటలకు ఈ కార్యక్రమం ప్రారంభమవుతుందని తెలిపారు. కార్యక్రమంలో ఏపీఈఆర్‌సీ సభ్యులు ఠాకూర్ రామ్ సింగ్, పి.రాజగోపాల్‌రెడ్డిలతో పాటు రాష్ట్ర విద్యుత్ పంపిణీ సంస్థల సీఎండీలు కె.సంతోషరావు (ఏపీఈపీడీసీఎల్, ఏపీఎస్పీడీసీఎల్), జె.పద్మజా జనార్దన్‌రెడ్డి (ఏపీసీపీడీసీఎల్) పాల్గొంటారని పేర్కొన్నారు.

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో నాక్ బృందం



నాక్ బృందానికి స్వాగతం పలుకుతున్న కళాశాల ప్రిన్సిపాల్, అధ్యాపకులు

నర్సీపట్నం : స్థానిక ప్రభుత్వ డిగ్రీ కళాశాలను నాక్ బృందం శుక్రవారం సందర్శించింది. నాక్ బృందానికి కళాశాల ప్రిన్సిపాల్ ఎస్.రాజు, అధ్యాపకులు పూర్ణకుంభంతో ఘన స్వాగతం పలికారు. బృందం చైర్మన్ డా.సుబీర్ మిత్ర, కోఆర్డినేటర్ వినీత్ పాఠక్, సభ్యుడు తేవాంగ్ పథో కళాశాలను పరిశీలించారు. రెండు రోజుల పాటు జరిగే పరిశీలనలో మొదటి రోజు కళాశాలలో జరుగుతున్న విద్యా బోధనపై పవర్‌పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా బృంద ప్రతినిధులకు ప్రిన్సిపాల్ వివరించారు. ఈ సందర్భంగా ప్రిన్సిపాల్ విలేకరులతో మాట్లాడుతూ నాక్ గుర్తింపునకు అవసరమైన ప్రమాణాలతో కళాశాలను తీర్చిదిద్దామన్నారు. ఇది వరకు జరిగిన నాక్ గుర్తింపుతో కళాశాల బి గ్రేడ్ పొందిందని, ఈసారి ఎ గ్రేడ్ సాధిస్తామన్న ఆశాభావం వ్యక్తం చేశారు.

రైతుల మేలుకోసమే సమగ్ర భూసర్వే

- కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి
- కె.కోటపాడు మండలంలో సుడిగాలి పర్యటన
- హైస్కూల్, అంగన్‌వాడీ, ఆర్బీకే కేంద్రాల్లో తనిఖీలు
- రీసర్వే తీరుపై పర్యవేక్షణ



భూ రీసర్వేపై రైతులతో మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

కె.కోటపాడు : అత్యంత పారదర్శకంగా జరుగుతున్న సమగ్ర భూ రీసర్వేతో రైతులకు మేలు జరుగుతుందని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. మండలంలోని పాతవలస, సూదివలస గ్రామాల్లో శుక్రవారం ఆయన సుడిగాలి పర్యటన చేశారు. ముందుగా పాతవలస జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలో నాడు-నేడు నిధులతో నిర్మిస్తున్న అదనపు తరగతి భవనాలను పరిశీలించారు. వచ్చే నెలలో జరగబోయే పబ్లిక్ పరీక్షలలో మంచి మార్కులతో ఉత్తీర్ణులు కావాలని టెన్త్ విద్యార్థులకు సూచించారు. పాతవలస హైస్కూల్‌పై తరచూ వస్తున్న ఫిర్యాదులపై ఆరా తీశారు. ఈ ఫిర్యాదులపై దృష్టి సారించి, సమస్యల్ని పరిష్కరించేలా డీఈవోకు ఆదేశాలు జారీ చేసినట్టు తెలిపారు.

అనంతరం ఆర్బీకే కేంద్రాన్ని పరిశీలించారు. ఈ సందర్భంగా హుద్‌హుద్ తుపాను తర్వాతి నుంచి ఈ ప్రాంతంలో రైతులు సాగు చేస్తున్న మామిడి పంట దిగుబడి 70 శాతం మేర పడిపోయిందన్నారు. కలెక్టర్‌కు రైతులు ఆదిరెడ్డి సన్యాసినాయుడు, వగ్రి రామునాయుడు, జామి శ్రావణ్, గండి ఈశ్వరరావు, పొంతపల్లి రవినాయుడు, జామి బుచ్చిరాజు తమ గోడు వెల్లబోసుకున్నారు. దీనిపై స్పందించిన కలెక్టర్ మామిడిపంట దిగుబడి తగ్గడానికి గల కారణాలను గుర్తించేందుకు శాస్త్రవేత్తల బృందాన్ని పంపిస్తామని రైతులకు భరోసానిచ్చారు. విద్యార్థులతోపాటు, పలు గ్రామాల ప్రజల రాకపోకలకు వీలుగా బస్సు సర్వీసు నడపాలని స్థానికులు కలెక్టర్‌కు విన్నవించుకున్నారు. ప్రజారవాణా సంస్థ ఆర్ఎంతో మాట్లాడి, చర్యలు తీసుకుంటామని కలెక్టర్ తెలిపారు. అంగన్‌వాడీ కేంద్రంలో చిన్నారులు వయసుకు తగ్గ ఎత్తు, బరువును చూసేందుకు అనుసరిస్తున్న విధానంపై అంగన్‌వాడీ కార్యకర్తను అడిగి తెలుసుకున్నారు. అంగన్‌వాడీలు అందించే పోషకాహారాన్ని గర్భిణులు వినియోగించుకోవాలని సూచించారు. అనంతరం పాతవలసలో జరుగుతున్న రీసర్వేను క్షేత్రస్థాయిలో పరిశీలించారు. రైతులతో మాట్లాడి వారు సంతృప్తి చెందేలా రెవెన్యూ సిబ్బందితో సర్వే నిర్వహిస్తామని భరోసానిచ్చారు. ఎలాంటి అపోహలకు తావులేకుండా రీ సర్వేను చేపడతామన్నారు. అనకాపల్లి జిల్లాలో రీసర్వే కార్యక్రమం మొదటి విడతలో 141 గ్రామాల్లో జరిగిందని, ప్రస్తుతం రెండవ దశలో భాగంగా 247 గ్రామాల్లో జరుగుతోందన్నారు. రెండు గ్రామాల్లోను జగనన్న కాలనీల్లో ఇళ్ల నిర్మాణాలు పూర్తికావడంపై సర్పంచ్‌లను, సిబ్బందిని కలెక్టర్ అభినందించారు. ఆయన వెంట తహసీల్దార్ జె.రమేష్‌బాబు, ఎంపీడీవో కె.శచీదేవి, ఎంఈవో టి.మధుమూర్తి, మండల ఇంజినీర్ బాలాజీ అప్పారావు, ఆర్‌డబ్ల్యూఎస్ జేఈ అల్లు శ్వేత, ఏపీఎం వెంకటలక్ష్మి, సర్పంచ్‌లు జామి శ్రావణ్, ఆదిరెడ్డి సన్యాసినాయుడు, ఎంపీటీసీ వగ్రి రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్లతో యువతకు ఉపాధి



మాట్లాడుతున్న కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

తుమ్మపాల : జిల్లాలో ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటుతో యువతకు ఉపాధి పెరిగి, గ్రామాలు ఆర్థికంగా బలోపేతమవుతాయని కలెక్టర్ రవిపట్టాన్‌శెట్టి అన్నారు. కలెక్టరేట్‌లో శుక్రవారం నిర్వహించిన సమీక్ష సమావేశంలో ఆయన మాట్లాడుతూ జిల్లాలో 160 ఫుడ్ ప్రాసెసింగ్ యూనిట్ల ఏర్పాటు లక్ష్యంగా కృషి చేస్తున్నట్టు తెలిపారు. ఇప్పటికే 53 యూనిట్ల నిర్మాణ పనులు శరవేగంగా సాగుతున్నాయన్నారు. జిల్లాలో గుర్తించిన 82 గ్రామాలలో ఫిష్ ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాలను ఏర్పాటు చేయాలని సంబంధిత అధికారులను ఆయన ఆదేశించారు. ప్రధానమంత్రి మత్స్య సంయోజన పథకంలో భాగంగా యూనిట్ వ్యయంలో 40 శాతం కేంద్ర ప్రభుత్వం భరిస్తుందన్నారు. కన్వర్జెన్సీ ఫండ్‌గా 30 శాతం మంజూరుకానున్నట్టు పేర్కొన్నారు. ఫుడ్ ప్రాసెసింగ్ కేంద్రాల నిర్మాణంతో మంచి ఆదాయం సమకూరుతుందన్నారు. రైతులకు గిట్టుబాటు ధరతో పాటు నిరుద్యోగులకు ఉపాధి కలుగుతుందన్నారు. జిల్లా ఉద్యానశాఖ అధికారి ప్రభాకరరావు, మత్స్యశాఖ అధికారి లక్ష్మణరావు, పశుసంవర్ధక శాఖ జేడీ ప్రసాదరావు, లీడ్ బ్యాంకు మేనేజర్ సత్యనారాయణ, డీఆర్‌డీఏ ఏపీడీ డైసీ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన గోవాడ సుగర్స్ క్రషింగ్

- 2.22 లక్షల టన్నుల చెరకు గానుగాట



గోవాడ సుగర్ ఫ్యాక్టరీ

చోడవరం: గోవాడ సుగర్స్ క్రషింగ్ శుక్రవారంతో ముగిసింది. ఆశించిన మేర చెరకు సరఫరా కాకపోవడంతో ఫ్యాక్టరీ క్రషింగ్ లక్ష్యాన్ని చేరుకోలేకపోయింది. మెరుగైన రికవరీ, నాణ్యమైన పంచదార తయారీలో గత సీజన్లకంటే మంచి ఫలితాలు వచ్చాయి. ఉప ఉత్పత్తులైన విద్యుత్, బెగాస్, మొలాసిస్ నుంచి ఆశించినమేర ఆదాయం సమకూరని పరిస్థితి నెలకొంది. 2022-23 క్రషింగ్ సీజన్‌లో 3 లక్షల టన్నులు గోవాడ ఫ్యాక్టరీ ఏరియా నుంచి మరో 50వేల టన్నులు నాన్‌మెంబర్స్, ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీల పరిధి నుంచి చెరకు సరఫరా అవుతుందని అంచనా వేశారు. దీంతో సుమారు 3.50 లక్షల టన్నుల చెరకు గానుగాడవచ్చని లక్ష్యంగా నిర్ణయించుకుని గత ఏడాది డిసెంబరు 12వ తేదీ నుంచి క్రషింగ్ ప్రారంభించారు. సీజన్ ముగింపు దశకు వచ్చేసరికి ఫ్యాక్టరీ ఏరియాలో చెరకు లేకపోగా ఏటికొప్పాక, తాండవ ఫ్యాక్టరీల నుంచి వస్తుందనుకున్న చెరకు రాలేదు. దీనివల్ల అనుకున్న లక్ష్యం చేరుకోలేపోయారు. ఈ సీజన్‌లో 2.22 లక్షల టన్నుల చెరకు గానుగాడారు. 1.89లక్షల క్వింటాళ్ల పంచదార ఉత్పత్తి చేశారు. పంచదార ఉత్పత్తి మెరుగ్గా వచ్చింది. సరాసరి రికవరీ 9.3కి దాటే లభించింది. పంచదార నాణ్యత కూడా ఈ సారి బాగుంది. గ్రేడింగ్‌లో సూపర్ క్వాలిటీ అయిన 'ఎం' రకం ఉత్పత్తి రావడం కొంత ఊరటనిచ్చింది. ఈ 'ఎం' రకం క్రిస్టల్ పంచదారకు డిమాండ్ ఉండడంతో జాతీయ, అంతర్జాతీయ మార్కెట్‌కు ఎగుమతి చేసే అవకాశం ఉంది. క్రషింగ్ ప్రారంభంలోనే ఈ ఏడాది కో జనరేషన్ ప్లాంట్‌లో ఒక టర్బైన్ యూనిట్ మరమ్మతులతో నిలిచిపోవడంతో విద్యుత్ అమ్మకం ద్వారా వచ్చే ఆదాయాన్ని ఈ ఏడాది ఫ్యాక్టరీ కోల్పోయింది. మరో పక్క బెగాస్ కూడా కావలసినంత లేకపోవడం వల్ల మధ్యలో క్రషింగ్‌కు అంతరాయం కలిగింది. ఇది కూడా ఫ్యాక్టరీకి కొంత ఆర్థిక నష్టం కలిగించింది. క్రషింగ్ లక్ష్యం చేరుకోలేకపోవడం వల్ల ఫ్యాక్టరీ ఈ ఏడాది ఆర్థిక ఇబ్బందులు ఎదుర్కొనే పరిస్థితి కనిపిస్తోంది.

గంజాయి నిందితులపై ప్రత్యేక నిఘా

ఎస్పీ గౌతమిసాలి



సమీక్ష సమావేశంలో మాట్లాడుతున్న ఎస్పీ గౌతమి సాలి

అనకాపల్లిటౌన్: గంజాయి కేసుల్లో బెయిల్‌పై వచ్చిన నిందితుల మీద ప్రత్యేక నిఘా ఉంచాలని ఎస్పీ గౌతమిసాలి అన్నారు. స్థానిక ఎస్పీ కార్యాలయంలో శుక్రవారం నెలవారీ నేరసమీక్ష నిర్వహించారు. గంజాయి కేసుల్లో దర్యాప్తు పెండింగ్‌లో ఉండడానికి గల కారణాలపై ఆరా తీశారు. గంజాయి రవాణా చేసేవారితోపాటు వారికి సహాయం చేసే వారిపై ప్రత్యేక నిఘా ఉంచాలన్నారు. రోడ్డు ప్రమాదాల నివారణకు కృషి చేయాలని, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలను ముమ్మరం చేయాలన్నారు. అంతకుముందు విధి నిర్వహణలో ఉత్తమ ప్రతిభ కనబరిచిన వారికి ప్రశంసాపత్రాలు అందజేసి, సత్కరించారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీలు బి.విజయభాస్కర్, పి.సత్యనారాయణరావు, అనకాపల్లి, పరవాడ, నర్సీపట్నం ఇన్‌చార్జి డీఎస్పీలు మళ్ల మహేశ్వరరావు, పి.శ్రీనివాసరావు, కె.ప్రవీణ్ కుమార్, ఆర్మ్‌డ్ రిజర్వ్ డీఎస్పీ పి.నాగేశ్వరరావు, సీఐలు దాడి మోహనరావు, చంద్రశేఖర్, లక్ష్మణ్ మూర్తి, అప్పలనాయుడు, ఎస్ఐలు పాల్గొన్నారు.

ఆ భూములకు పట్టాలివ్వడం కుదరదు

జేసీ కల్పనా కుమారి



తుమ్మపాల: చీడికాడ మండలం కోనాంలోని సర్వే నెం.289లో గిరిజనుల సాగులో ఉన్న 29.86 ఎకరాల ప్రైవేటు/జిరాయితీ భూమికి సంబంధించి పట్టాలు ఇవ్వడం కుదరదని జేసీ కల్పనాకుమారి స్పష్టం చేశారు. కొన్నాళ్లుగా భూమిని సాగుచేస్తున్నామని, తమ పేరుమీద పట్టాలు మంజూరు చేయాలని కోనాం గ్రామ శివారు కొత్తవీధి (గొంటి) గ్రామానికి చెందిన గిరిజనులు వినతులు సమర్పిస్తున్నారని చెప్పారు. దీనిపై క్షేత్రస్థాయిలో స్వయంగా పరిశీలించినట్టు తెలిపారు. కలెక్టర్ కార్యాలయంలో శుక్రవారం ఏర్పాటు చేసిన విలేకరుల సమావేశంలో ఆ వివరాలను జేసీ వెల్లడించారు. సర్వే నెం.289లో మొత్తం 37 ఎకరాల విస్తీర్ణం ఉందని, దానిలో భూహక్కు నియంత్రణ చట్టం ప్రకారం సీలింగ్ ల్యాండ్‌గా ఉన్న 7.22 ఎకరాల భూమి ప్రభుత్వానిదన్నారు. మిగిలిన భూమి ప్రైవేటు వ్యక్తులకు చెందినదిగా ప్రభుత్వ రికార్డుల్లో ఉందన్నారు. రికార్డుల్లో రైతువారీ మెట్ట భూమిగా ఉన్న 29.86 ఎకరాలకు గిరిజనుల పేరిట పట్టాలు మంజూరు చేయలేమన్నారు. ఆ భూమి గతంలో ఒక వ్యక్తి పేరున తప్పు రిజిస్ట్రేషన్ జరగడం, సదరు వ్యక్తి భూమిలోకి ప్రవేశించే క్రమంలో వివాదం మొదలైందన్నారు. ఆ వ్యక్తి వద్ద సరైన భూమిపై హక్కు పత్రాలు లేవని చెప్పారు.

త్వరితగతిన రీసర్వే

జిల్లాలో రీసర్వే పనులు త్వరితగతిన జరుగుతున్నట్టు జేసీ తెలిపారు. 430 మంది సర్వేయర్లను బృందాలుగా నియమించి సర్వే చేపడుతున్నట్టు చెప్పారు. మే నాటికి రీసర్వే పూర్తికావచ్చన్నారు. మొదటి విడతలో 141 గ్రామాల్లో రీసర్వే పూర్తయిందని తెలిపారు. రెండవ విడతలో 247 గ్రామాలకుగాను 147 గ్రామాల్లో పూర్తవగా, 100 గ్రామాల్లో సర్వే పనులు జరుగుతున్నట్టు చెప్పారు. రావికమతం మండలంలో నాలుగు గ్రామాలకు సంబంధించి రికార్డులు అందబాటులో లేవని, రైతుల సాగు ఆధారంగా సర్వే చేస్తున్నామన్నారు. సాగులో ఉన్న ప్రభుత్వ భూమిని సదరు రైతుల పేరున క్రమబద్ధీకరణ చేసి అసైన్ చేస్తామని చెప్పారు. అయితే రైతులు నిరుపేదలై ఉండాలన్నారు. రీసర్వేలో అన్నదమ్ముల పంపకాలకు ఎక్కువగా ఇబ్బందులు తలెత్తుతున్నాయన్నారు. జిల్లాలో 14 వేల ఎకరాల అనాధీన భూములను గుర్తించామన్నారు. 22ఎ జాబితాలో నమోదైన జిరాయితీ భూములకు సంబంధించి వందకు పైగా వినతులను పరిష్కరించామన్నారు. అనకాపల్లి, అచ్యుతాపురం, పరవాడ, సబ్బవరం మండలాల్లో ప్రభుత్వ భూముల ఆక్రమణలపై ప్రత్యేక దృష్టి సారిస్తున్నట్టు జేసీ తెలిపారు.

హెచ్ఎం, 14 మంది టీచర్లకు మెమోలు జారీ



దేవరాపల్లిలో ఉపాధ్యాయుల సమీక్షలో ఉప విద్యాశాఖాధికారి ప్రేమ్‌కుమార్

దేవరాపల్లి: మండలంలో ఒక హెచ్ఎంతో సహా 15 మంది టీచర్లకు డిప్యూటీ డీఈవో ఎన్.ప్రేమ్‌కుమార్ మెమోలు జారీ చేశారు. పలు పాఠశాలలను శుక్రవారం ఆయన సందర్శించారు. ముందుగా ఎం.అలమండ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలను సందర్శించారు. బోధన, ఇతర అంశాలలో నిర్లక్ష్యంగా వ్యవహరించిన హెచ్ఎం అరుణ కుమారి, ఏడుగురు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశారు. దేవరాపల్లి ప్రభుత్వ ఉన్నత పాఠశాలను తనిఖీ చేసి, విధి నిర్వహణలో నిర్లక్ష్యంగా ఉన్న ఏడుగురు ఉపాధ్యాయులకు మెమోలు జారీ చేశారు. అనంతరం ఉపాధ్యాయులతో సమీక్ష నిర్వహించి బోధనలో అలసత్వం వహిస్తే సహించేది లేదని హెచ్చరించారు. తరువాత దేవరాపల్లి కైరళి ఇంగ్లిష్ మీడియం హైస్కూల్‌ను సందర్శించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ వచ్చేనెల 3 నుంచి జరిగే పదవ తరగతి పరీక్షలకు జిల్లాలో 111 పరీక్షా కేంద్రాలను సిద్ధం చేసినట్టు చెప్పారు. 23,913 మంది విద్యార్థులు పరీక్షలకు హాజరుకానున్నట్టు తెలిపారు. ఈయన వెంట దేవరాపల్లి హెచ్ఎం బి.చంద్రశేఖర్, సీఆర్పీలు ఆదిరెడ్డి ఈశ్వరరావు, రమణ తదితరులు ఉన్నారు.

విజయవంతంగా జీ-20 మాక్ సదస్సు



మాక్ సదస్సులో పాల్గొన్న విద్యార్థులు

బీచ్‌రోడ్డు (విశాఖ తూర్పు): నగరంలో జీ20 మాక్ సదస్సు నిర్వహించారు. జీ20 సదస్సుపై ప్రజలకు అవగాహన కల్పించడంలో భాగంగా శుక్రవారం ఏయూ కాన్వకేషన్ హాల్‌లో మాక్ సదస్సును నిర్వహించారు. పలు ఆర్థికపరమైన అంశలను చర్చించారు. అలాగే జీ20 దేశాల అభివృద్ధికి ఏఏ దేశాల సహాయ సహకారాలు అవసరం, ప్రస్తుతం ఎదుర్కొంటున్న ఆర్థిక అంశాలను పరిష్కరించడం ఎలా అనే దానిపై మాక్ కాంక్లేవ్‌లో చర్చించారు. ఈ మాక్ కాంక్లేవ్ గ్రూప్ ప్యానల్‌కు నాగార్జున యూనివర్సిటీ విశ్రాంత వీసీ వి.బాలమోహన్ దాస్ అధ్యక్షత వహించారు. జీ20 దేశాల తరుపున ఏయూ పరిశోధన విద్యార్థులు, సామాజిక వేత్తలు ప్యానల్‌లో ప్రతినిధులుగా పాల్గొన్నారు.సదస్సుకు వచ్చే అతిథులను భారతీయ సంప్రదాయ నృత్యాలతో స్వాగతం పలికారు.

ప్రజలను భాగస్వామ్యం చేయడం కోసమే..

జీ20 సదస్సుపై ప్రజలకు అవగాహన కల్పించటంతో పాటు వారిని భాగస్వామ్యం చేయటంలో భాగంగా గత కొన్ని రోజులుగా అనేక కార్యక్రమాలను నిర్వహించడం జరుగుతోందని జీవీఎంసీ కమిషనర్ రాజాబాబు తెలిపారు. అందులో భాగంగా మాక్ కాంక్లేవ్‌ను నిర్వహించడం జరిగిందన్నారు. ఈ సమావేశంలో ప్రముఖ వైద్యులు కూటికుప్పల సూర్యారావు, సామాజిక వేత్త సరస్వతి తదితరులు పాల్గొన్నారు.

'అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే' షార్ట్ ఫిల్మ్ ప్రారంభం



నూకాంబిక ఉత్సవ విగ్రహం ముందు క్లాప్ కొడుతున్న డైరెక్టర్ శంకర్, దాడి వీరభద్రరావు

అనకాపల్లిటౌన్ : ఉత్తరాంధ్ర ఇలవేల్పు అనకాపల్లి నూకాంబిక అమ్మవారి ఆలయంలో 'అమ్మ దయ ఉంటే అన్నీ ఉన్నట్లే' షార్ట్‌ఫిల్మ్‌కు డైరెక్టర్ శంకర్ శుక్రవారం శ్రీకారం చుట్టారు. డైరెక్టర్ శంకర్, వైఎస్సార్‌సీపీ రాష్ట్ర ప్రధాన కార్యదర్శి దాడి వీరభద్రరావు క్లాప్ కొట్టారు. ఈ సందర్భంగా దాడి వీరభద్రరావు మాట్లాడుతూ అమ్మవారి దివ్య చరితపై షార్ట్ ఫిల్మ్ రూపొందించడం అభినందనీయమన్నారు. కార్యక్రమంలో బీసీ సాధికార సమితి రాష్ట్ర గవర ఇన్‌చార్జి మళ్ల సురేంద్ర, ఆలయ ఈవో చంద్రశేఖర్, టెక్నీషియన్లు, ఆలయ సిబ్బంది పాల్గొన్నారు.

ఈదురుగాలులతో అరటికి నష్టం



గుడివాడలో ఈదురు గాలులకు పడిపోయిన అరటి తోట

రావికమతం : మండలంలోని పలు గ్రామాల్లో శుక్రవారం ఈదురు గాలులతో కూడిన భారీ వర్షం కురిసింది. గత మూడు రోజులుగా అడపాదడపా ఇదే పరిస్థితి కొనసాగుతోంది. వర్షాలకు తోడు తీవ్ర గాలులతో పలుచోట్ల చెట్లు, విద్యుత్ స్తంభాలు నేలకొరిగాయి. గురువారం నాటి భారీ గాలులకు గుడివాడ గ్రామానికి చెందిన రైతు నక్కా మహాలక్ష్మినాయుడు సాగు చేస్తున్న రెండెకరాల్లోని అరటి తోట పూర్తిగా దెబ్బతింది. ఆ రైతుకు తీరని నష్టం కల్గించింది. సుమారు రూ.లక్షకు పైగా నష్టం వాటిల్లినట్టు రైతు వాపోతున్నాడు. మండలంలోని కె.గదబపాలెంలో ట్రాన్స్‌ఫార్మర్‌తో సహా రెండు విద్యుత్ స్తంభాలు విరిగిపడ్డాయి. టి.అర్జాపురం, దిబ్బలపాలెంలో ఆరు స్తంభాలు నేలకొరిగాయి. ట్రాన్స్‌కో సిబ్బంది కొత్త స్తంభాలను అమర్చే పనిలో ఉన్నారు. టి.అర్జాపురంలో స్తంభాలు వేసి విద్యుత్ సరఫరా పునరుద్ధరించగా మిగిలిన రెండు గ్రామాలకు ఇంకా విద్యుత్ సరఫరా ఇవ్వాల్సి ఉంది.

కాశీపురం-బోయిలకింతాడ రోడ్డుకు మోక్షం

- డిప్యూటీ సీఎం చొరవతో రూ. 20 కోట్లు మంజూరు
- 13.5 కిలోమీటర్ల మేర 24 అడుగుల వెడల్పున విస్తరణ
- రోడ్డు పొడవునా 60 కల్వర్టుల నిర్మాణం



కాశీపురం-బోయిలకింతాడ మధ్య కల్వర్టు పనులు

దేవరాపల్లి: మండలంలోని కాశీపురం నుంచి గవర వరం వెళ్లే రోడ్డు విస్తరణకు ఎట్టకేలకు మోక్షం లభించింది. డిప్యూటీ సీఎం బూడి ముత్యాలనాయుడు ప్రత్యేక చొరవతో ఈ రోడ్డు విస్తరణకు రూ. 20 కోట్లు మంజూరయ్యాయి. ఈ మొత్తంతో 13.5 కిలోమీటర్ల మేర 12 అడుగుల నుంచి 24 అడుగుల వెడల్పున విస్తరించనున్నారు. ఈ మార్గంలో 60 కల్వర్టులు నిర్మించనున్నారు. గత టీడీపీ ప్రభుత్వం ఈ రోడ్డు విస్తరణ అటుంచితే, కనీసం మరమ్మతులు చేపట్టలేదు. పర్యవసానంగా రోడ్డు మధ్యలో భారీ గతుకులు పడ్డాయి. దీంతో నిత్యం రాకపోకలు సాగించే ప్రజలు, వాహన చోదకులు తీవ్ర ఇక్కట్లు పడుతున్నారు. వీరి కష్టాలను గుర్తించిన డిప్యూటీ సీఎం సీఎం వైఎస్. జగన్‌మోహన్‌రెడ్డి దృష్టికి తీసుకెళ్లి నిధులు మంజూరు చేయించారు. టెండర్ ప్రక్రియ పూర్తి కావడంతో రోడ్డు విస్తరణ పనుల్లో భాగంగా ప్రస్తుతం కల్వర్టు నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయి. ఈ రోడ్డు విస్తరణతో కాశీపురం నుంచి చిననందిపల్లి, పెదనందిపల్లి, తారువ, తిమిరాం, కలిగొట్ల మీదుగా బోయిలకింతాడ వరకు సుమారు 20 గ్రామాలకు రహదారి కష్టాలు తీరనున్నాయి.

గత పాలకుల నిర్లక్ష్యంతోనే...



ఈ రోడ్డు విస్తరించాలని కొన్నేళ్లుగా డిమాండ్ చేస్తున్న గత టీడీపీ పాలకులు కనీసం పట్టించుకోలేదు. దీంతో రోడ్డు పూర్తిగా ధ్వంసమై ఛిద్రంగా మారింది. డిప్యూటీ సీఎం ప్రత్యేక దృష్టి సారించి రూ. 20 కోట్లు మంజూరు చేయించారు. పరిసర గ్రామాల ప్రజలంతా ఆయనకు రుణపడి ఉంటాం.

– బూరె బాబూరావు, సర్పంచ్, బోయిలకింతాడ

రెండు నెలల్లో కల్వర్టు పనులు పూర్తి

రూ. 20 కోట్లతో కాశీపురం నుంచి బోయిలకింతాడ వరకు రోడ్డు విస్తరణతోపాటు 60 కల్వర్టులు నిర్మించాల్సి ఉంది. ప్రస్తుతం కల్వర్టు నిర్మాణ పనులు చేపడుతున్నాం. రెండు నెలల్లో కల్వర్టు నిర్మాణ పనులు పూర్తి చేస్తాం. తర్వాత రోడ్డు నిర్మాణ పనులు చేపడతాం.

– పి. శ్రీనివాసరావు, సీఆర్ఎఫ్ ఏఈఈ, కె.కోటపాడు

నేడే మహా బడ్జెట్

డాబాగార్డెన్స్: జీవీఎంసీ సర్వ సభ్య(ప్రత్యేక) బడ్జెట్ సమావేశం శనివారం జరగనుంది. జీవీఎంసీ ప్రధాన కార్యాలయంలోని నూతన సమావేశ మందిరంలో ఉదయం 10.30గంటలకు నిర్వహించనున్న సమావేశంలో 2023-24 ఏడాదికి సంబంధించి బడ్జెట్ అంచనాలు, 2022-23 ఏడాదికి సవరించిన బడ్జెట్ అంచనాలు కౌన్సిల్ సభ్యుల ముందుకు రానున్నాయి. 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు తయారు చేసి గతేడాది నవంబర్ 29, 30 తేదీల్లో నిర్వహించిన సమావేశాల్లో ఆమోదానికి స్థాయీ సంఘం ముందుంచారు. స్థాయీ సంఘం సవరించిన బడ్జెట్ అంచనాలను ఆమోదించింది. అవి ఇవి..

- 2022-23 ఆర్థిక సంవత్సరానికి సంబంధించి సవరించిన బడ్జెట్‌లో సచివాలయ భవనాల నిర్మాణాలకు రూ.2 కోట్ల నుంచి రూ.5 కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.3కోట్ల నుంచి రూ.10 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- ఫ్లైఓవర్ కోసం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.10 నుంచి రూ.50 కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.30 నుంచి రూ.60 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- నూతన నీటి సరఫరా లైన్ల కోసం 2023-24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో రూ.80 నుంచి రూ.100 కోట్లకు సవరించాలని ఆమోదించారు.
- జీవీఎస్‌సీసీఎల్ సహకారం(స్మార్ట్‌సిటీ)కోసం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాలు రూ.200 నుంచి రూ.60 కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.250 నుంచి రూ.100 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- సోలార్ లైటింగ్ కోసం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.2 కోట్ల నుంచి రూ.10 కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.2కోట్ల నుంచి రూ.10 కోట్లకు సవరించాలని, విరాళాలతో చేపట్టే పనుల కోసం 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.కోటి నుంచి రూ.4 కోట్లు, 2023-24 ఆర్థిక సంవత్సరానికి బడ్జెట్ అంచనాల్లో రూ.7.50 కోట్ల నుంచి రూ.19.50 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.
- నది/సరస్సులు, నీటి ట్యాంకుల పరిరక్షణకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.0.50 కోట్ల నుంచి రూ.2కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.కోటి నుంచి రూ.2కోట్లకు సవరించాలని, సీఎండీఎఫ్ కింద ముడసర్లోవ పార్క్ అభివృద్ధి భూమి రక్షణకు 2022-23 ఆర్థిక సంవత్సరానికి సవరించిన బడ్జెట్ అంచనాల్లో రూ.13కోట్ల నుంచి రూ.55 కోట్లకు, 2023-24 బడ్జెట్ అంచనాల్లో రూ.10 నుంచి రూ.80 కోట్లకు సవరించాలని పేర్కొన్నారు.



2023-24 ఆర్థిక సంవత్సరం అంచనాల బడ్జెట్ ఇలా(రూ.లక్షల్లో)

	జమ	ఖర్చులు
సాధారణ పద్దు	91,458	17,515
ఇంజినీరింగ్	38,466	93,761
లైటింగ్ కింద	--	15,195
ప్రాజెక్టులు	19,350	39,970
ప్లానింగ్	31,540	5,242
యూసీడీ	52,000	53,735
విద్య	15	1,907
పార్కులు, లీజర్స్, సిమెటరీస్‌కు	2,000	11,436
ప్రజారోగ్యం	11,811.50	42,588
మంచినీటి సరఫరా	43,160	25,985
జేఎన్ఎన్‌యూఆర్ఎం	10	5,575
రాజీవ్ ఆవాస్ యోజన	--	500
అమృత్	15,000	16,400
ఇతర నిధులతో ప్రాజెక్టులు	19,120	19,120
ఆర్థిక సంఘం నిధులు	27,600	28,150
డిపాజిట్లు అడ్వాన్సులు	30,732	29,270

క్షయ వ్యాధి నివారణకు కృషి

జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి

అనకాపల్లి టౌన్ : క్షయవ్యాధి అంతమొందించేందుకు ప్రతి ఒక్కరూ కృషి చేయాలని జిల్లా కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి అన్నారు. స్థానిక గాంధీనగరం జీవీఎంసీ కల్యాణమండపంలో శుక్రవారం క్షయవ్యాధి నివారణ దినోత్సవానికి హాజరై మాట్లాడారు. రాష్ట్రంలో క్షయ నిర్మూలనలో జిల్లాను ముందంజలో నిలిపేందుకు వైద్య ఆరోగ్యశాఖాధికారులు కృషి చేయాలని సూచించారు. క్షయ వ్యాధి పట్ల ప్రస్తుత పరిస్థితుల్లో భయపడనక్కర్లేదని, ప్రజలకు అవగాహన కల్పించాలన్నారు. క్షయవ్యాధి నివారణ జిల్లా అధికారి శారదాబాయి మాట్లాడుతూ 15 రోజులకు మించి కఫంతో కూడిన దగ్గు వచ్చినట్లయితే దగ్గరలో ఉన్న వైద్యాధికారులను సంప్రదించాలన్నారు. అంతకుముందు కలెక్టర్ క్షయ వ్యాధిపై అవగాహన ర్యాలీని ప్రారంభించారు. డీఎంహెచ్‌వో ఎ.హేమంత్, ఎన్టీఆర్ ఆస్పత్రి సూపరింటెండెంట్ శ్రావణ్‌కుమార్, వైద్యులు, జీవీఎంసీ అధికారులు, ఏఎన్ఎంలు, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.

మండలాలవారీగా ఎస్‌పీసీఏ కమిటీలు

తుమ్మపాల: మండలాల వారీగా ఎస్‌పీసీఏ కమిటీలను ఏర్పాటు చేయాలని కలెక్టర్ రవి పట్టాన్‌శెట్టి ఆదేశించారు. కలెక్టరేట్‌లో నిర్వహించిన సమావేశంలో ఆయన మాట్లాడుతూ జంతువుల పట్ల ప్రేమతో ఉండాలన్నారు. క్రూరత్వ నివారణ చట్టాన్ని సమర్థంగా అమలుచేయాలని, అందుకు కమిటీని ఏర్పాటు చేసేందుకు ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. జిల్లాలో జంతు కారుణ్య సంఘం నిర్వహణకు ఐదెకరాల భూమిని కేటాయిస్తామని చెప్పారు. కుక్కల సంఖ్య తగ్గించేందుకు సంతాన నియంత్రణ కార్యక్రమం అమలుకు ప్రణాళిక సిద్ధం చేయాలని అనకాపల్లి జోనల్ కమిషనర్‌ను, పశుసంవర్ధక శాఖ అధికారిని ఆదేశించారు. తప్పనిసరిగా జంతువుల జనన రేటు వివరాలను నమోదు చేయాలన్నారు. వేసవిలో పట్టణ ప్రాంతాల్లో పశువుల దప్పిక తీర్చేందుకు నీటి తొట్టిలను ఏర్పాటు చేయాలన్నారు. జేసీ కల్పనాకుమారి, పశుసంవర్ధక శాఖ అధికారి ప్రసాదరావు, డీపీవో శిరీషారాణి, రవాణా అధికారి ఎం.వీర్రాజు పాల్గొన్నారు.

అడవిదున్న సంచారంపై పరిశీలన

రావికమతం: మండలంలోని కొమిర ఉరలోవ కొండ ప్రాంతంలో అడవిదున్న సంచరిస్తుందన్న సమాచారం మేరకు మేడివాడ సెక్షన్ ఫారెస్ట్ సిబ్బంది శుక్రవారం పరిశీలించారు. కొండ సమీప పొలాల్లో కనిపించినట్టుగా గ్రామ రైతులు గొర్లె సత్యనారాయణ, చందక అర్జున, సొలం రాజు తదితర్లు సర్పంచ్ రవికుమార్‌కు దృష్టికి తీసుకొచ్చారు. ఆయన సమాచారం మేరకు బీట్ అధికారి గోవింద్ తన సిబ్బందితో కొండ ప్రాంతాల్లో దాని అడుగుజాడలు పరిశీలించారు. అటువంటి ఆనవాళ్లు ఏమీ కనిపించ లేదని, అయినప్పటికీ రైతులు రాత్రిళ్లు జాగ్రత్తలు తీసుకోవాలని సూచించారు.

గుర్తు తెలియని వృద్ధురాలి మృతి

అనకాపల్లిటౌన్: స్థానిక ఆర్టీసీ కాంప్లెక్స్‌లోసుమారు 70 సంవత్సరాల వయస్సుగల గుర్తు తెలియని వృద్ధురాలు మృతి చెందింది. డిపో అధికారుల సమాచారం మేరకు మృతదేహాన్ని ఎన్టీఆర్ ఆస్పత్రికి తరలించి భద్రపరిచినట్టు సీఐ దాడి మోహనరావు తెలిపారు. కేసు నమోదు చేసి దర్యాప్తు చేస్తున్నట్టు ఆయన చెప్పారు.

వెదురు సోయగం



విశాఖ నగరంలో కొలువుదీరనున్న వెదురు ఆకృతులతో పూల సోయగాలు

సాక్షి, విశాఖపట్నం : అందాల విశాఖలో వెదురు సోయగాలు కనువిందు చేయనున్నాయి. జీ-20 దేశాల సదస్సుకు వచ్చే అతిథులను విశేషంగా ఆకట్టుకోనున్నాయి. ఈనెల 28, 29 తేదీల్లో జరగనున్న ఈ సదస్సుకు విశాఖ నగరం ఆతిథ్యం ఇస్తోంది. ఇందుకోసం నగరం ముస్తాబవుతోంది. పర్యావరణహిత వెదురుతో మోడరన్ బాస్కెట్లు, బ్యాంబూ పోల్స్, బ్యాంబూ తబలాల ఆకృతితో వీటిని వైఎస్సార్ జిల్లా మైదుకూరులో తయారు చేయిస్తున్నారు. అక్కడ వెదురు ఉత్పత్తుల తయారీలో నైపుణ్యం ఉన్న వారితో వీటిని వినూత్నంగా రూపొందిస్తున్నారు. వీటిపై అందంగా పూసే పూల మొక్కలను అమర్చనున్నారు. వీటిని ఆర్కే బీచ్‌లోని నోవోటెల్ హోటల్ నుంచి రుషికొండ సమీపంలో ఉన్న జీ-20 సదస్సు జరిగే ర్యాడిసన్ బ్లూ హోటల్ ప్రాంతం వరకు రోడ్డుకు ఇరువైపులా, రోడ్డు మధ్యలోని డివైడర్ల పైన, బీచ్‌రోడ్డులోని ఫుట్‌పాత్‌ల పైన ఏర్పాటు చేయనున్నారు. ఇందులో 500 వరకు బ్యాంబూ బాస్కెట్లు, 50కి పైగా తబలాలు, 200 వరకు బ్యాంబూ పోల్స్ ఉండనున్నాయి. ఇవి కాకుండా మరో వెయ్యి వరకు వెదురు ఫ్లవర్ వాజ్‌లను కూడా సిద్ధం చేస్తున్నారు. రాష్ట్ర బ్యాంబూ మిషన్, మేదరి హ్యాండీ క్రాఫ్ట్స్ అండ్ వెల్ఫేర్ డెవలప్‌మెంట్ సొసైటీ ద్వారా వీటన్నిటినీ తయారు చేస్తున్నారు. గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి పర్యవేక్షణలో వీటి ఏర్పాట్లు జరుగుతున్నాయి. ఈ వెదురు ఉత్పత్తులను మైదుకూరు నుంచి సింహాచలం నర్సరీ వద్దకు తీసుకొచ్చారు. రవాణాలో కొన్నింటి వార్నిష్‌లు పాడయ్యాయి. అలాంటి వాటికి మళ్లీ వార్నిష్‌లు వేస్తున్నారు. నేడో, రేపో వీటిని ఎంపిక చేసిన ప్రాంతాల్లో ఏర్పాటు చేయనున్నారు.

పూణే, కడియంల నుంచి పూలమొక్కలు

వెదురు ఆకృతులపై ఏర్పాటు చేసే ప్రత్యేక రకాల పూల మొక్కలను (ఫ్లవరింగ్ ప్లాంట్స్) పూణే, కడియం నర్సరీల నుంచి రప్పిస్తున్నారు. వీటిని అమర్చాక పూలు వికసిస్తాయి. అవి నాలుగైదు రోజుల పాటు వాడిపోకుండా ఉంటాయి. నోవోటెల్-రాడిసన్ బ్లూ హోటళ్ల మధ్య బీచ్ రోడ్డులో విదేశీ ప్రతినిధుల రాకపోకలుంటాయి. దీనిని దృష్టిలో ఉంచుకుని వెదురు ఆకృతులపై అమర్చిన పూల మొక్కలు ఈ ప్రతినిధులను ఆకట్టుకోనున్నాయి. ఉగాది సందర్భంగా తాడేపల్లిలోని సీఎంఓ వద్ద ఇలాంటి వాటినే ఏర్పాటు చేశారు. అవి ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డితో పాటు ఎందరినో అలరించాయి.

ఈ తరహా ఇదే తొలిసారి..

ఇప్పటివరకు దేశంలోని త్రిపుర, అస్సాం, మేఘాలయ తదితర ఈశాన్య రాష్ట్రాల్లోనే ఈ తరహా వెదురు ఆకృతులు తయారవుతున్నాయి. తొలిసారిగా ఆంధ్రప్రదేశ్‌లో వీటిని ప్రవేశపెడుతున్నట్టు రాష్ట్ర మేదర కార్పొరేషన్ డైరెక్టర్ రాఘవేంద్ర 'సాక్షి'కి తెలిపారు. మైదుకూరులో మూడు వారాల నుంచి వీటి తయారీలో నైపుణ్యం ఉన్న మేదరులు రేయింబవళ్లు శ్రమించి వీటిని రూపొందిస్తున్నారని చెప్పారు. జీ-20 సదస్సు ముగిశాక మళ్లీ వీటిని భద్రపరచుకోవచ్చు. మూడు, నాలుగేళ్ల పాటు ఇవి చెక్కు చెదరవు. అందువల్ల భవిష్యత్తులో ఇలాంటి ప్రతిష్టాత్మక సదస్సులు జరిగినప్పుడు మళ్లీ వీటిని బ్యూటిఫికేషన్ కోసం ఉపయోగించుకోవచ్చని గ్రీనింగ్ అండ్ బ్యూటిఫికేషన్ కార్పొరేషన్ ఎండీ రాజశేఖర్‌రెడ్డి 'సాక్షి'కి చెప్పారు. వెదురు పెంపకాన్ని రాష్ట్ర ప్రభుత్వం ప్రోత్సహిస్తోందని తెలిపారు.

దుమ్ములేపిన దబాంగ్



విశాఖ స్పోర్ట్స్: పీఎంపాలెంలోని వైఎస్సార్ ఏసీఏ-వీడీసీఏ స్టేడియం వేదికగా సెలబ్రిటీ క్రికెట్ లీగ్ తొలి సెమీ ఫైనల్ చివరి బంతి వరకు ఉత్కంఠగా సాగింది. భోజ్‌పురి దబాంగ్ చివరి రెండు బంతులకు 10 పరుగులు చేయాల్సిన తరుణంలో.. అగర్ ఒక బంతిని ఫోర్‌గా, చివరి బంతిని సిక్సర్‌గా మలిచాడు. దీంతో ముంబయి హీరోస్ ఢీలా పడిపోయారు. ప్రస్తుత సీజన్ సెలబ్రిటీ క్రికెట్ లీగ్(సీసీఎల్) నాకవుట్ పోటీలు శుక్రవారం వైఎస్సార్ స్టేడియంలో ప్రారంభమయ్యాయి. తొలి రోజు రెండు సెమీస్‌లు జరిగాయి. ఫ్లడ్‌లైట్ల వెలుతురులో జరిగిన తొలి సెమీస్‌లో ముంబయి హీరోస్‌తో భోజ్‌పురి దబాంగ్ జట్టు తలపడింది. టాస్ గెలిచిన దబాంగ్ జట్టు ఫీల్డింగ్ ఎంచుకోవడంతో హీరోస్ ఆటకు దిగారు. టీ-20 మ్యాచ్ అయినా పదేసి ఓవర్లతో రెండు ఇన్నింగ్స్‌గా సాగింది. ఈ మ్యాచ్ తొలి ఇన్నింగ్స్ 10 ఓవర్లలో ఐదు వికెట్లు కోల్పోయి 109 పరుగులు చేసింది. సమీర్ 34 పరుగులు చేశాడు. ప్రతిగా దబాంగ్ జట్టు ఆరు వికెట్లు కోల్పోయి 80 పరుగులే చేయడంతో తొలి ఇన్నింగ్స్‌లో 29 పరుగులు వెనుకబడింది. ప్రవేశ్ 21 పరుగులు చేశాడు. కెప్టెన్ మనోజ్ తివారి 12 బంతుల్లోనే 19 పరుగులు చేశాడు. ఇక హీరోస్ రెండో ఇన్నింగ్స్‌లో 62 పరుగులకే మరో రెండు బంతులుండగానే ఆలౌట్ అయింది. 92 పరుగుల లక్ష్యంతో రెండో ఇన్నింగ్స్ ప్రారంభించిన దబాంగ్ జట్టు చివరి మూడు ఓవర్లలో 31 పరుగులు చేయాల్సి వచ్చింది. చివరికి దబాంగ్ జట్టు హీరోస్‌పై ఆరు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఈ సందర్భంగా అఖిల్ హీరోగా నటించిన ఏజెంట్ చిత్రంలోని ఓ పాటను రిలీజ్ చేశారు. ఈ కార్యక్రమంలో ఆ చిత్ర హీరోయిన్ సాక్షి విద్య పాల్గొన్నారు.

విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలి



సదస్సులో మాట్లాడుతున్న ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు

మాకవరపాలెం: మన సాంకేతిక పరిజ్ఞానాన్ని ఉపయోగించి ఉత్పత్తులు తయారు చేసేలా విద్యార్థులు వినూత్నంగా ఆలోచించాలని విశాఖ ఎన్ఎస్‌టీఎల్ డైరెక్టర్ శ్రీనివాసరావు అన్నారు. స్థానిక అవంతి ఇంజినీరింగ్ కళాశాలలో స్పార్క్స్ పేరుతో రెండు రోజులపాటు నిర్వహించనున్న సాంకేతిక సదస్సును శుక్రవారం ప్రారంభించారు. ఈ కార్యక్రమంలో ముఖ్యఅతిథిగా పాల్గొన్న ఆయన మాట్లాడుతూ ఇంజినీరింగ్ విద్యలో జ్ఞానమే సాంకేతిక నైపుణ్యాలకు పెట్టుబడి అని చెప్పారు. కాకినాడ జేఎన్‌టీయూ ప్రొఫెసర్ మూర్తి మాట్లాడుతూ జాతీయ స్థాయిలో పోటీపడాలంటే విద్యార్థులకు ఇలాంటి సాంకేతిక సదస్సులు ఎంతగానో ఉపయోగపడతాయన్నారు. భారత్ అటామిక్ రీసెర్చ్ సెంటర్ నుంచి వచ్చిన జయప్రకాశ్, ఎన్ఆర్‌డీసీ అసిస్టెంట్ డెవలప్‌మెంట్ ఇంజినీరు సుధా, అవంతి విద్యాసంస్థల జనరల్ సెక్రటరీ ప్రియాంక, కళాశాల ప్రిన్సిపాల్ మోహనరావు ప్రసంగించారు. ఈ సదస్సులో కళాశాల అధ్యాపకులు, విద్యార్థులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులకు గాయాలు

రోలుగుంట: నర్సీపట్నం-వడ్డాది ఆర్అండ్ బీ రోడ్డులో ఎదురెదురుగా వస్తున్న ఆటో, బైకు ఢీకొన్న ప్రమాదంలో ఇద్దరు విద్యార్థులు తీవ్రంగా గాయపడ్డారు. ఎస్ఐ బి.నాగకార్తీక సంఘటనా స్థలానికి వెళ్లి పరిశీలించి, కేసు నమోదు చేశారు. స్థానిక జూనియర్ కళాశాలలో శుక్రవారం ఇంటర్మీడియెట్ పరీక్ష రాసి, తమ గ్రామం టి.అర్జాపురానికి ముమ్మిన రాము, ఇల్లపు వంశీకృష్ణలు బైక్‌పై వెళుతుండగా ఎదురుగా వస్తున్న ఆటో రోలుగుంట కొత్త చెరువు మలుపులో ఢీకొంది. దీంతో విద్యార్థులిద్దరూ తీవ్రంగా గాయపడ్డారు. క్షతగాత్రులను నర్సీపట్నం ఏరియా ఆస్పత్రికి తరలించి చికిత్స అందజేస్తున్నారు.

సింహాచలంనాయుడు మృతిపై ఆందోళన



దేవరాపల్లిలో ఆందోళన చేపడుతున్న మృతుడు సింహాచలంనాయుడు కుటుంబ సభ్యులు

దేవరాపల్లి: స్థానిక ట్రాక్టర్ యజమాని జామి సింహాచలంనాయుడు (28) మృతిపై తమకు పలు అనుమానాలు ఉన్నాయని బాధిత కుటుంబ సభ్యులు ఆందోళన చేపట్టారు. ఈ నెల 18న అర్ధ రాత్రి సమయంలో అతడు చెట్టుకు ఉరేసుకుని అనుమానాస్పదంగా మృతి చెందిన విషయం విదితమే. ఈ మేరకు మృతుడు తల్లి సింహాచలమ్మ, తమ్ముడు జామి గౌరినాయుడు, అక్క మిడతాడ దేముళ్లమ్మ తదితర కుటుంబ సభ్యులు, స్థానికులు దేవరాపల్లిలో శుక్రవారం నిరసన చేపట్టారు. దేవరాపల్లికి చెందిన అమ్మాయితో సింహాచలంనాయుడు ప్రేమలో ఉన్నాడని, ఆమె కుటుంబ సభ్యులే హత్య చేసి ఆత్మహత్యగా చిత్రీకరించారని ఆరోపించారు. ఈ ఘటనపై పోలీసులు నిష్పక్షపాతంగా విచారణ చేపట్టి, మృతికి కారకులైన వారిని తక్షణమే అరెస్టు చేసి, కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేశారు.

గొర్రెలు, మేకలకు డీ వార్మింగ్ మందులు

- జిల్లా పశుసంవర్ధక అధికారి డాక్టర్ ప్రసాదరావు



సమావేశంలో మాట్లాడుతున్న పశు సంవర్ధక శాఖ జిల్లా అధికారి డాక్టర్ ప్రసాదరావు

అనకాపల్లి రూరల్ : జిల్లా వ్యాప్తంగా గొర్రెలు, మేకల్లో సీజనల్ వ్యాధులు ప్రబలకుండా వాటి నివారణకు డీ వార్మింగ్ మందులు పంపిణీ చేస్తున్నట్టు జిల్లా పశు సంవర్ధక శాఖాధికారి డాక్టర్ బి.ప్రసాదరావు తెలిపారు. శుక్రవారం అనకాపల్లిలో ఉమ్మడి విశాఖ జిల్లా గొర్రెల పెంపకందారుల సహకార యూనియన్ సర్వసభ్య సమావేశం జరిగింది. జిల్లా చైర్మన్ గంటా శ్రీరామ్ అధ్యక్షతన నిర్వహించిన సమావేశంలో ఆయన ముఖ్య అతిథిగా మాట్లాడారు. గతంలో ఇన్సూరెన్స్ లేకుండా పశు నష్టపరిహారం చెల్లించేవారిమన్నారు. ప్రస్తుతం ప్రభుత్వం ట్యాగులు వేసిన గొర్రెలు, మేకలకు మాత్రమే పరిహారం ఇస్తున్నట్టు స్పష్టం చేశారు. దీంతో అందరూ ట్యాగులు వేయించడం తప్పనిసరన్నారు. జిల్లా గొర్రెలు, మేకల పెంపకందారుల సంఘం అధ్యక్షుడు గంటా శ్రీరామ్ మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం గొర్రెలు, మేకల పెంపకందారుల సహకార సంఘాలకు 50శాతం సబ్సిడీతో రుణాలు ఇవ్వాలని కోరారు. ఎన్‌సీడీసీ రుణాలను నూరు శాతం చెల్లించినప్పటికీ రావల్సిన నిధులు విడుదల చేయలేదని ఆవేదన వెలిబుచ్చారు. సమావేశంలో జిల్లా వైస్ చైర్మన్ సుబ్బి శ్రీనివాసరావు, జిల్లా డైరెక్టర్లు పినిబోయిన అప్పారావు యాదవ్, ఉరిగిటి శివ సూర్యనారాయణ, గోకాడ దేముడు నాయుడు, బొట్టా వరహాలు, పల్లా సత్యారావు, ఎదిరి అప్పారావు, పల్లా శ్రీరాములు, ఎం.అప్పలనాయుడు, ముచ్చా రామునాయుడు తదితరులు పాల్గొన్నారు.

క్లుప్తంగా

2న వరాహలక్ష్మీనృసింహ స్వామి తిరుకల్యాణం

అనకాపల్లిటౌన్ : గవరపాలెం దిబ్బవీధి కొబ్బరితోటలో శ్రీ వరాహలక్ష్మీనృసింహ స్వామివారి తిరు కల్యాణ మహోత్సవం ఏప్రిల్ 2 నిర్వహించనున్నట్లు ఆలయ నిర్వాహకులు మళ్ల రామచంద్రరావు శుక్రవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఆ రోజు ఉదయం 5 గంటలకు ఉత్సవమూర్తులకు అభిషేకం, మధ్యాహ్నం 3 గంటలకు రథోత్సవము, రాత్రి 7 గంటలకు స్వామివారి కల్యాణం జరగనుందన్నారు. ఏప్రిల్ 23న స్వామివారి చందనోత్సవ కార్యక్రమం అత్యంత వైభవంగా జరపున్నట్లు పేర్కొన్నారు.

మసీదుల్లో ఇఫ్తార్ విందు

కశింకోట : మండలంలోని ముస్లింలు శుక్రవారం నుంచి రంజాన్ ఉపవాస దీక్షలు చేపట్టారు. తెల్లవారుజాము నుంచి ఉపవాసం చేసి సాయంత్రం ఉపవాస దీక్ష విరమించారు. ఈ సందర్భంగా స్థానిక జామియా మసీదు, నూరి, నరసింగబిల్లి మసీదుల్లో ప్రత్యేక ప్రార్థనలు జరిగాయి. అనంతరం ఇఫ్తార్ విందు ఏర్పాటుచేశారు. పవిత్ర రంజాన్ సందర్భంగా మసీదుల్లో నెల రోజులపాటు ఇఫ్తార్ ఏర్పాటు చేయనున్నట్టు కమిటీ సభ్యులు చెప్పారు.

'ఆదివాసీలకు న్యాయం చేయాలి'



ధర్నానుద్దేశించి మాట్లాడుతున్న అజయ్‌కుమార్

అనకాపల్లిటౌన్ : చీడికాడ మండలం కోనాం రెవెన్యూ పరిధి కొత్తవీధి ఆదివాసీలకు న్యాయం చేయాలని అఖిల భారత వ్యవసాయ గ్రామీణ కార్మిక సంఘం జాతీయ కార్యదర్శి పి.ఎస్.అజయ్‌కుమార్ అన్నారు. స్థానిక నెహ్రూచౌక్‌లో 16 మంది ఆదివాసీలు నిరసన దీక్ష చేపట్టారు. దీక్షా శిబిరాన్ని శుక్రవారం ఆయన సందర్శించి ఆదివాసీలకు మద్దతు తెలిపారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ కొత్తవీధి గ్రామాన్ని జిల్లా కలెక్టర్ క్షేత్రస్థాయిలో పరిశీలించాలని కోరారు. తొలుత భగత్‌సింగ్ చిత్రపటానికి పూలమాల వేసి నివాళులర్పించారు. కార్యక్రమంలో ప్రజాసంఘాల నాయకులు, గిరిజన రైతులు పాల్గొన్నారు.

కశింకోట సంతలకు వేలం

కశింకోట : స్థానిక వారపు సంత, రోజు వారీ సంతలకు శుక్రవారం నిర్వహించిన వేలం పాటలో రూ.2,11,200 పలికింది. స్థానిక పంచాయతీ కార్యాలయంలో ఎంపీడీవో కొంకి అప్పారావు పర్యవేక్షణలో సర్పంచ్ మంత్రి జయరజని, పంచాయతీ కార్యదర్శి నల్లాన రమేష్‌ల సమక్షంలో వేలం పాట నిర్వహించారు. రోజువారీ సంతకు రూ.1.41 లక్షలు, వారపు సంతకు రూ.70,200తో అందరికంటే ఎక్కువకు పాడిన యల్లపు శ్రీనివాసరావుకు వీటిని ఖరారు చేశారు. వేలంలో 16 మంది పాల్గొన్నారు.

బెల్లం ధరలు



అనకాపల్లి మార్కెట్‌కు శుక్రవారం 1,480 బెల్లం దిమ్మలు వచ్చాయి.

దిమ్మల రకం	కనిష్ట ధర	గరిష్ట ధర
స్పెషల్ రకం	-	-
మొదటి రకం	3,800	4,130
రెండో రకం	3,380	3,710
మూడోరకం	3,050	3,430

అనకాపల్లి సినిమాలు

సార్	రాజా
కోస్టీ	సత్యనారాయణస్క్రీన్-1
జాన్‌విక్ (చాప్టర్-4)	సత్యనారాయణస్క్రీన్-2
కబ్జా	షిర్డిసాయి
బలగం	పర్తిసాయి
రంగమార్తాండ	వెంకటేశ్వర
పులి	శ్రీసత్య
దాస్ కా ధమ్కీ	రామచంద్ర

రక్త నిల్వలు

అనకాపల్లిటౌన్ : జిల్లా ఎన్టీఆర్ వైద్యాలయ రక్తనిధి కేంద్రంలో 28 యూనిట్ల రక్తం నిల్వ ఉంది. ఏ పాజిటివ్-5 యూనిట్లు, ఏ నెగిటివ్-1 యూనిట్, బీ పాజిటివ్-12 యూనిట్లు, బీ నెగిటివ్-1 యూనిట్, ఓ పాజిటివ్-8 యూనిట్లు, ఓ నెగిటివ్-1 యూనిట్ శుద్ధి చేసిన రక్తం నిల్వ ఉంది. అవసరమైన వారు వైద్యాలయ బ్లడ్‌బ్యాంకు ప్రతినిధి గంగయ్య(9848418400)ను సంప్రదించవచ్చు.

గ్యాస్ సమాచారం

అనకాపల్లిటౌన్ : ఇండేన్ గ్యాస్ ఏజెన్సీ ద్వారా శుక్రవారం 427 మంది గ్యాస్ బుక్ చేసుకున్నారు. గతంలో బుక్ చేసుకున్న వారిలో 410 మందికి సిలిండర్లు సరఫరా చేశారు. వివరాలకు ఇండేన్‌గ్యాస్ ఏజెన్సీ(9441108144)ని సంప్రదించవచ్చు.

అకాల వర్షాలు.. సస్యరక్షణ చర్యలు



పిసినికాడలో అకాల వర్షాలకు నీట మునిగిన టమాటా



నేలకు వాలిన నువ్వు పంటను పరిశీలిస్తున్న ఏవో రంగాచారి

- వర్షాలకు పొలాలు, తోటల్లో నిలిచిన నీరు
- సస్య రక్షణ చర్యల్లో వ్యవసాయ అధికారులు

అనకాపల్లి రూరల్ : ఐదు రోజులుగా కురుస్తున్న అకాల వర్షాలకు అనకాపల్లి, కశింకోట, మునగపాక మండలాల్లో పలు పంటలు నీటి ముంపునకు గురయ్యాయి. మొక్కజొన్న, నువ్వులు, మినుము, కూరగాయల పంటలు, పండ్ల తోటల్లో వర్షం నీరు చేరి, రైతుల్లో ఆందోళన కలిగిస్తోంది. ఈ నేపథ్యంలో పంట పొలాల్లో తీసుకోవాల్సిన సస్యరక్షణ చర్యలపై అధికారులు రంగంలోకి దిగారు.

పాక్షిక పంట నష్టం

అనకాపల్లి వ్యవసాయ సబ్ డివిజన్ ఏడీ ఎం.రామారావు, అనకాపల్లి ఏవో పీయూబీపీ రంగాచారి, ఏఈవోలు, వ్యవసాయ సిబ్బంది, కేవీకే, ఏరువాక కేంద్రం శాస్త్రవేత్తలు శుక్రవారం నుంచి పంట పొలాల క్షేత్రస్థాయి పరిశీలన ప్రారంభించారు. పంట తీరు ఆధారంగా రైతులకు సస్యరక్షణ చర్యలు గురించి వివరిస్తున్నారు. అనకాపల్లి మండలంలో వెంకుపాలెం, పిసినికాడ, భవులవాడ, తుమ్మపాల, దిబ్బపాలెం, రేబాక గ్రామాల్లో నీట మునిగిన నువ్వు పంటను పరిశీలించారు. ఈ సమయంలో తీసుకోవాల్సిన జాగ్రత్తల్ని ఆయా రైతులకు తెలిపారు. ఇప్పటి వరకూ 124 మంది రైతులకు పాక్షికంగా పంట నష్టం వాటిల్లినట్టు అధికారులు గుర్తించారు. పంటలవారీగా సస్యరక్షణ చర్యలను వివరించారు.

మినుము పంట

మినుము పంటలో వర్షం నీరు నిలిచిపోకుండా చిన్న చిన్న బోదెలను ఏర్పాటు చేసుకుని నీటిని బయటకు తీయాలి. నూర్పిడి పూర్తయిన మినుము విత్తనాలను ఆరబెట్టుకోవాలి. మినుము గింజలకు బూజు పట్టకుండా తగిన జాగ్రత్తలు తీసుకోవాలి. విత్తనాలను కుప్పలుగా వేసి, పరదాలు కప్పుకుని కాపాడుకోవాలి.

నువ్వు పంట

నువ్వు పంటలో నీరు నిల్వలేకుండా చేసి, నేలవాలిన మొక్కలను నిలబెట్టాలి. చిన్న, చిన్న కాలువలుగా చేసి నీటిని తొలగించాలి. అధిక తేమ లేకుండా జాగ్రత్త వహించాలి. వాతావరణ మార్పులతో పైరుకు పురుగులు, తెగుళ్లు ఆశించి ఎదుగుదలను దెబ్బతీయొచ్చు. సకాలంలో సస్యరక్షణ చర్యలు చేపడితే మంచి దిగుబడులు వస్తాయి. రసం పీల్చే పురుగు, ఆకుముడత, కాయతొలుచు పురుగుల నివారణపై దృష్టి సారించాలి.

కూరగాయల పంటలు

కూరగాయల సాగు పొలాల్లో చేరిన వాన నీటిని వీలైనంత వేగంగా తొలగించాలి. అధిక వర్షాలు కారణంగా మిరప, టమాటా పంటల్లో బ్యాక్టీరియా, ఆకుపచ్చ తెగులు ఆశించే అవకాశం ఉంది. నివారణకు 30 గ్రాములు కాపర్ ఆక్సీక్లోరైడ్, ప్లాంటమైసిన్ 1 గ్రాము చొప్పున 10 లీటర్ల నీటిలో కలిపి పిచికారీ చేయాలి. అధిక తేమ కారణంగా కాయలను ఆశించే కాయకుళ్లు తెగులు నివారణకు ముందు జాగ్రత్త చర్యగా మాంకోజెబ్ 2.5 గ్రాముల మందును లీటరు నీటిలో కలిపి పిచికారీ చేయాలి.

పండ్ల తోటలు

పండ్ల తోటల్లో అధిక వర్షాలకు చేరిన నీటిని తీసి వేయాలి. లేత తోటల్లో చనిపోయిన మొక్కలను తొలగించి కొత్తవి నాటుకోవాలి. అధిక గాలులకు ఒరిగిపోయిన చెట్ల మొదళ్లకు మట్టిని ఎగదోసి, వేర్లను కప్పి, కర్రలతో ఊతం ఇవ్వాలి. విరిగిన కొమ్మలను కత్తిరించి ఆ భాగంలో కాపర్‌సల్ఫేట్ ఒక కిలో, సున్నం ఒక కిలో, 10 లీటర్ల నీరు కలిపిన మిశ్రమాన్ని పూయాలి. చెట్ల మొదళ్ల దగ్గర ఒక శాతం ఈ మిశ్రమాన్ని లేదా కాపర్ ఆక్సీక్లోరైడ్ 3 గ్రాములు చొప్పున లీటరు నీటికి కలిపి వేయొచ్చు.

సస్యరక్షణ చర్యలు తప్పనిసరి



కూరగాయలు, పండ్ల తోటల సాగులో కచ్చితంగా ఈ సీజన్‌లో సస్యరక్షణ చర్యలు చేపట్టాలి. ఎక్కువగా వర్షం నీరు పొలాల్లో నిల్వ లేకుండా చూసుకోవాలి. సకాలంలో యాజమాన్య పద్ధతులను పాటించడం వల్ల తెగుళ్లు సోకకుండా కాపాడుకునే అవకాశం ఉంటుంది. ఇప్పటికే అకాల వర్షాల కారణంగా దెబ్బతిన్న తోటలు, పొలాలను పరిశీలిస్తున్నాం. పంట నష్టపోయిన రైతులను గుర్తించి నివేదికలను ఉన్నతాధికారులకు పంపిస్తాం. – ఎం.రామారావు, అసిస్టెంట్ డైరెక్టర్, అనకాపల్లి సబ్‌డివిజన్

రామాలయ కలశ పునఃప్రతిష్ట



తేగాడలో రామాలయ కలశ ప్రతిష్టాపనకు నిర్వహిస్తున్న హోమం

కశింకోట : మండలంలోని తేగాడ గ్రామంలో రామాలయం పసిడి కలశ పునఃప్రతిష్టాపన మహోత్సవం శుక్రవారం ఘనంగా నిర్వహించారు. ఆలయంపై ఏర్పాటుచేసిన కలశాలు హుదూద్ సమయంలో పడిపోయాయి. దీంతో పురోహితుడు గునుపూడి ప్రకాష్ శర్మ, బ్రహ్మశ్రీ కొండవీటి సుబ్రహ్మణ్యసాయికిషోర్ శర్మల ఆధ్వర్యంలో వేద మంత్రాల నడుమ నూతన కలశాలను ఆలయ శిఖరంపై పునఃప్రతిష్ఠ చేశారు. ఈ సందర్భంగా హోమాలు, అర్చనలు, అభిషేకాలు తదితర ప్రత్యేక పూజా కార్యక్రమాలు నిర్వహించారు. వైఎస్సార్ సీపీ యువజన నాయకుడు నీటిపల్లి దివాకర్, హేమలత దంపతుల ఆధ్వర్యంలో జరిగిన పూజల్లో స్థానిక నాయకులు పరవాడ గోవిందరావు, విజయలక్ష్మి, పరవాడ రవిమణి, మాకాల చిరంజీవి, జ్యోతి తదితరులు పాల్గొన్నారు.

పెళ్లిరాట మహోత్సవం

రామాలయంలో ఈ నెల 30న శ్రీరామ నవమిని పురస్కరించుకుని సీతారాముల కల్యాణోత్సవానికి సంప్రదాయంగా పెళ్లిరాట వేశారు. పూజలు చేశారు. ఎంపీటీసీ సభ్యురాలు తుంపాల మంగతాయారు, మాజీ సర్పంచ్‌లు నీటిపల్లి రాజేశ్వరరావు, గొర్లి అప్పారావు, సిరసపల్లి అప్పారావు, పరవాడ దత్తాత్రేయ తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా గౌరీపరమేశ్వరుల ఊంజల్ సేవ



ఊంజల్ సేవలో పాల్గొన్న భక్తులు

అనకాపల్లిటౌన్ : స్థానిక గవరపాలెం గౌరీపంచాయతన దేవాలయంలో గౌరీపరమేశ్వరుల 178వ ఊంజల్ సేవా కార్యక్రమం శుక్రవారం జరిగింది. దేవాలయం అర్చకులు అంపోలు గోపాలకృష్ణశర్మ, పొందూరు సూర్యనారాయణ శాస్త్రి, శేషు, సాయిలు వేద విదులైన పండితులచే ఈ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఊంజల్ సేవలో కర్రి గోపీనాథ్, శ్యామల, వీరవెంకట సత్యనారాయణ, మోహినిలక్ష్మీలావణ్య దంపతుల చేతుల మీదుగా ఈ పూజలు జరిగాయి. అనంతరం శ్రీ గౌరీపరమేశ్వరి అమృతవర్షిణి బృందం వ్యవస్థాపకురాలు పెతకంశెట్టి సుజాత ఆధ్వర్యంలో కోలాటం నిర్వహించారు. కార్యక్రమంలో దేవాలయం అధ్యక్షుడు బొడ్డేడ సన్యాసినాయుడు, కార్యదర్శి బుద్ధ రమణాజీ, కోశాధికారి కర్రి శివ సూర్యనారాయణ, మహిళా భక్తులు పాల్గొన్నారు.

సుబ్రహ్మణ్య, దత్తాత్రేయుల విగ్రహాల ప్రతిష్ట



చింతలపాలెంలో సుబ్రహ్మణ్యస్వామి విగ్రహ ప్రతిష్టాపనలో పాల్గొన్న ప్రజలు

కశింకోట : మండలంలోని చింతలపాలెం సాయిబాబా మందిర ప్రాంగణంలో శుక్రవారం నూతనంగా సుబ్రహ్మణ్యస్వామి, దత్తాత్రేయస్వామిల విగ్రహాల ప్రతిష్టాపనా కార్యక్రమం వేదపండితుల మంత్రోచ్ఛారణల మధ్య వైభవంగా జరిగింది. సర్పంచ్, ఆలయ చైర్మన్ కొట్టి రాము ఆధ్వర్యంలో జరిగిన ఈ కార్యక్రమంలో పీఏసీఎస్ మాజీ ఉపాధ్యక్షుడు మజ్జి కన్నబాబు, ఉప సర్పంచ్ పల్లా అప్పలకొండ, మాజీ సర్పంచ్ కర్రి దుర్గినాయుడు, స్థానిక నాయకులు జెర్రిపోతుల నూకినాయుడు, సియాద్రి నాగేష్, సేనాపతి శ్రీనివాసు, కోన రమణ తదితరులు పాల్గొన్నారు.

ముగిసిన నూకాంబిక మాలధారణ దీక్ష



అనకాపల్లిటౌన్ : తాకాశివీధి నూకాంబిక అమ్మవారి మాలధారణ భక్తులు శుక్రవారం రాత్రి దీక్ష విరమించారు. నియమనిష్ఠలతో మండల దీక్ష పూర్తి చేసిన భక్తులు ఆలయంలో ఇరుముళ్లు ధరించి అగ్నిగుండం తొక్కుతూ అమ్మవారిని దర్శించుకున్నారు. నూకాంబికకు ఇరుముళ్లు సమర్పించారు. కార్యక్రమంలో ఆలయ చైర్మన్ తాకాశి రాజేష్, కమిటీ సభ్యులు తాకాశి సూర్యారావు, తాకాశి కొండలరావు, బేతి ఈశ్వరరావు, తాకాశి కృష్ణ, తాకాశి నాగేష్, తాకాశి విస్సు, తాకాశి సత్యందొర, గంగుపాం మహేష్‌దొర, కారుకుండి కన్నా పాల్గొన్నారు.

అగ్నిగుండం తొక్కుతున్న మాలధారణ భక్తులు (ఇన్‌సెట్)తాకాశివీధి నూకాంబిక

'ఆసరా నగదుతో స్వయం ఉపాధి పెంచుకోండి'



జి.భీమవరంలో స్వయం సహాయక సంఘాల సభ్యులతో మాట్లాడుతున్న జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు



ఏఎస్ పేటలో ఆసరా పథకం అవగాహన కార్యక్రమంలో పాల్గొన్న స్వయం సహాయక సంఘాల సభ్యులు

కశింకోట : వైఎస్సార్ ఆసరా పథకం ద్వారా జమకానున్న నగదుతో స్వయం సహాయక సంఘాల మహిళలు తమ జీవనోపాధిని మెరుగుపరచుకుని, ఆర్థికాభివృద్ధి సాధించడానికి కృషి చేయాలని జెడ్పీటీసీ సభ్యుడు దంతులూరి శ్రీధర్‌రాజు, ఎంపీపీ కలగా లక్ష్మి సూచించారు. మండలంలోని కన్నూరుపాలెం, జి.భీమవరం, జమాదులపాలెం గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధుల వినియోగంపై సభ్యులకు శుక్రవారం అవగాహన కల్పించారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ముఖ్యమంత్రి వైఎస్ జగన్‌మోహన్‌రెడ్డి ఎన్నికల్లో ఇచ్చిన హామీ మేరకు శనివారం ఇవ్వనున్న మూడో విడత ఆసరా పథకం నగదు లబ్ధిదారుల బ్యాంకు ఖాతాల్లో నేరుగా జమ కానుందన్నారు. సమావేశంలో ఏపీఎం ఎస్.శ్రీనివాసరావు, సర్పంచ్‌లు కలగా గున్నయ్యనాయుడు, హనుమంతు వెంకటలక్ష్మణరావు, బండారు వాసు, ఎస్.శివ, కరక రాజ్యలక్ష్మి, మండల మహిళా సమాఖ్య అధ్యక్షురాలు కూండ్రపు అరుణ, అనకాపల్లి మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, ఉపాధ్యక్షుడు కరక సోమునాయుడు, ఎంపీటీసీ సభ్యులు అల్లం శంకరరావు, గూడెపు లక్ష్మి, వైఎస్సార్ సీపీ మండల ప్రధాన కార్యదర్శి కరక శేషు, కార్యదర్శి చిన్నోడు, వీవోఏలు పద్మావతి, తులసి, కుమారి, ఉమాలక్ష్మి, మౌనిక, ఎ.కుమారి, సీసీ బి.రామకృష్ణ, తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని ఏఎస్ పేట, కొత్తపల్లి గ్రామాల్లో వైఎస్సార్ ఆసరా పథకం మూడో విడత నిధుల మంజూరుపై స్వయం సహాయక సంఘాలకు శుక్రవారం అవగాహన కలిగించారు. ఆసరా పథకంతో తమ ఆర్థిక పరిస్థితి మెరుగుపడిందని సంఘాల సభ్యులు తెలిపారు. సమావేశంలో మార్కెట్ కమిటీ మాజీ చైర్మన్ మలసాల కిషోర్, కొత్తపల్లి వైఎస్సార్ సీపీ అధ్యక్షుడు అద్దెపల్లి శ్రీనివాసరావు, బుచ్చియ్యపేట సర్పంచ్ కోన నాయుడు, పంచాయతీ కార్యదర్శి సత్యనారాయణ, సీసీ అనూరాధ తదితరులు పాల్గొన్నారు.

నేడు రాజమండ్రిలో బీసీ సభ



మురళీకృష్ణను సత్కరిస్తున్న సంఘం సభ్యులు

అనకాపల్లిటౌన్ : బీసీ సమస్యలపై రాజమండ్రిలో శనివారం బీసీ సభ నిర్వహించనున్నట్టు జాతీయ బీసీ సంక్షేమ సంఘం రాష్ట్ర విద్యార్థి విభాగం కార్యదర్శి కశిరెడ్డి మురళీకృష్ణ అన్నారు. పట్టణంలోని సంఘ కార్యాలయంలో శుక్రవారం జరిగిన కార్యక్రమంలో ఆయన మాట్లాడారు. 2024 ఎన్నికలను దృష్టిలో పెట్టుకుని బీసీలంతా ఐక్యత ప్రదర్శించాలన్నారు. బీసీ సభకు జాతీయ అధ్యక్షుడు ఆర్.కృష్ణయ్య హాజరుకానున్నట్టు పేర్కొన్నారు. అనంతరం కార్యదర్శి మురళీకృష్ణను సంఘం సభ్యులు సత్కరించారు.

చిరుధాన్యాలతో ఆరోగ్య సిరులు

- మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి ఉషారాణి
- ఎంపీడీవో కార్యాలయంలో చిరుధాన్యాల ప్రదర్శన



సమావేశంలో మాట్లాడుతున్న జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారిణి ఉషారాణి

అనకాపల్లి రూరల్ : చిరుధాన్యాల్లో ఉండే అధిక పోషకాలు ఆరోగ్యానికి ఎంతో మేలు చేస్తాయని జిల్లా మహిళా శిశు సంక్షేమ సాధికారత అధికారి జి.ఉషారాణి అన్నారు. శుక్రవారం అనకాపల్లి ఎంపీడీఎవో కార్యాలయ సమావేశమందిరంలో పోషణ్ పక్వాడా కార్యక్రమంలో ఆమె పాల్గొన్నారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ మహిళలకు చిరుధాన్యాలతో తయారుచేసే వంటకాలు, వాటి ప్రయోజనాలపై అవగాహన ఉంటే కుటుంబమంతటికీ మేలు జరుగుతుందన్నారు. చిరుధాన్యాలను ఆహారంగా తీసుకోవాల్సిన ఆవశ్యకతను వివరించారు. అంతర్జాతీయ చిరుధాన్యాల మహోత్సవంలో భాగంగా ఆహారపు అలవాట్లు మార్చుకుని, ప్రతి ఒక్కరూ తమ ఆహారంలో చిరుధాన్యాలను భాగంగా చేసుకోవాలన్నారు. ఇటీవల బాల్యవివాహాలు ఎక్కువగా జరుగుతున్నాయని వీటిని అదుపుచేయడానికి అన్నిశాఖలు సహకరించాలని కోరారు. రక్తహీనత నివారణకు తీసుకోవాల్సిన ఆహారంపై వివరించారు. సమావేశానికి హాజరైన వివిధ శాఖల అధికారులు చిరుధాన్యాల వినియోగంపై గ్రామాల్లో విస్తృతంగా ప్రచారం నిర్వహించాలని సూచించారు. సమావేశంలో భాగంగా చిరుధాన్యాల ప్రదర్శ ఏర్పాటు చేశారు. అంతకుముందు ఎంపీడీవో కార్యాలయం నుంచి నెహ్రూచౌక్ కూడలి వరకు చిరుధాన్యాలపై అవగాహన ర్యాలీ నిర్వహించారు. జిల్లా విద్యాశాఖాధికారిణి వెంకటలక్ష్మమ్మ, ఎంపీడీవో కె ధర్మారావు, వెలుగు, ప్రకృతి వ్యవసాయం, డీఆర్‌డీఏ, ఐసీడీఎస్ శాఖల మహిళా సిబ్బంది, పలువురు మహిళలు పాల్గొన్నారు.

మహిళా పాల రైతుల సభ్యత్వ నమోదు



సర్టిఫికెట్లు అందుకుంటున్న మహిళా పాల రైతులు

అనకాపల్లి రూరల్ : మండలంలోని తుమ్మపాల మేజర్ పంచాయతీలో జగనన్న పాలవెల్లువ పథకం ద్వారా మహిళా పాల రైతుల సహకార సొసైటీ సభ్యులకు సభ్యత్వ నమోదు పత్రాలను సర్పంచ్ తట్టా పెంటయ్యనాయుడు శుక్రవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ జగనన్న పాల వెల్లువ పథకం ద్వారా రైతు భరోసా కేంద్రాల్లో పాల సేకరణ కేంద్రాలను ఏర్పాటు చేసినట్టు తెలిపారు. చేయూత పథకం ద్వారా తుమ్మపాల మహిళా డెయిరీ అసోసియేషన్ కేంద్రాన్ని మరింత సమర్థవంతంగా నిర్వహించాలన్నారు. ఈ మహిళా సంఘాలను ఏపీ సహకార సంస్థల చట్టం-1964 కింద నమోదు చేస్తూ రాష్ట్ర ప్రభుత్వం ఉత్తర్వులు జారీ చేసిందన్నారు. ప్రతీ లీటరుకు రూ.50 చొప్పున మూడు రకాల బోనస్‌లను ప్రకటించినట్టు వెల్లడించారు. ఇందులో పాల సంఘం ప్రెసిడెంట్ పడాల శారదమ్మ, ఆర్బీసీ సత్యనారాయణ, పడాల గణపతి, వైస్ ప్రెసిడెంట్ చదరం చిన్న, వార్డు సభ్యులు తర్ర సత్యారావు, మాదిబోయిన నాగరాజు, యనమశెట్టి రామారావు, మాజీ వైస్ ప్రెసిడెంట్ మగసాల లక్ష్మీ వెంకట్ తదితరులు పాల్గొన్నారు.

'నీట మునిగిన టమాటా పంటకు పరిహారమివ్వాలి'



ఆవఖండంలో నీటమునిగిన టమాటా పంటలపై రైతులతో మాట్లాడుతున్న విల్లూరి పైడారావు, వ్యవసాయశాఖ అధికారి రంగాచారి

అనకాపల్లిటౌన్ : ఇటీవల కురిసిన వర్షాలకు ఆవఖండంలోని సుమారు 300 ఎకరాల్లో టమాటా పంట నీటమునిగిందని, నష్టపోయిన రైతులను ప్రభుత్వమే ఆదుకోవాలని అనకాపల్లి వ్యవసాయదారుల సంఘం ఉపాధ్యక్షుడు విల్లూరి పైడారావు ప్రభుత్వాన్ని కోరారు. శుక్రవారం పంట నష్టపోయిన రైతులతో ఆవఖండంలో ఆయన పర్యటించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఎకరా విస్తీర్ణంలో టమాటా సాగుకు రూ.35వేలు ఖర్చవుతుందన్నారు. అకాల వర్షాలకు జీవీఎంసీ డ్రైనేజీ వాటర్ ఆవఖండంలోకి రావడం వల్ల పంట నీటమునిగిందన్నారు. నీటమునిగిన టమాటా పంటను జిల్లా ఉద్యానవనశాఖ అధికారులు పరిశీలించి, రైతులకు ప్రభుత్వం నుంచి ఆర్థిక సాయం అందేలా చర్యలు తీసుకోవాలన్నారు. కార్యక్రమంలో మండల వ్యవసాయ అధికారి పీయూబీపీ రంగాచారి, వ్యవసాయ విస్తరణ అధికారి గణేష్, రైతులు కర్రి మోదినాయుడు, పరదేశినాయుడు, కొణతాల శ్యామ్, కర్రి నూకరాజు, ఉమామహేశ్వరరావు, పొలిమేర శ్రీను తదితరులు పాల్గొన్నారు.

'ఉన్నత విద్యకు పదో తరగతి పునాది'



గురుకుల పాఠశాల విద్యార్థులతో మాట్లాడుతున్న వెంకటరెడ్డి

అనకాపల్లిటౌన్ : విద్యార్థులు పదో తరగతి పరీక్షలపై దృష్టి సారించాలని బీసీ సంక్షేమ గురుకుల పాఠశాల జిల్లా కన్వీనర్ నల్లమిల్లి వెంకటరెడ్డి అన్నారు. స్థానిక గవరపాలెం మహాత్మా జ్యోతిబాపూలే గురుకులంలో విద్యార్థులతో శుక్రవారం ఆయన సమావేశమయ్యారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పదో తరగతి జీవితానికి పునాదివంటిదని, బాగా చదివి తల్లిదండ్రులకు, పాఠశాలకు పేరు తీసుకురావాలని సూచించారు. గురుకుల పాఠశాలలో విద్యనభ్యసించినవారే ప్రస్తుతం ప్రభుత్వ, ప్రైవేటు సంస్థల్లో ఉన్నత స్థాయిలో పని చేస్తున్నారని పేర్కొన్నారు. వారిని స్ఫూర్తిగా తీసుకుని ఉన్నతస్థానాలను అధిరోహించాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో అనకాపల్లి, చోడవరం, పాయకరావుపేట గురుకుల పాఠశాలల ప్రిన్సిపాళ్లు దేవరశెట్టి వెంకటేశ్వర్లు, రత్నకుమారి, లక్ష్మీప్రసన్న, ఉపాధ్యాయులు, విద్యార్థులు పాల్గొన్నారు.

నేడు మండల సమావేశం

అనకాపల్లి రూరల్ : మండల పరిషత్ సర్వసభ్య సమావేశం శనివారం ఉదయం 10.30 గంటల నుంచి జరపనున్నట్లు ఎంపీడీవో కె ధర్మారావు తెలిపారు. ఎంపీపీ గొర్లి సూరిబాబు అధ్యక్షతన జరగనున్న ఈ సమావేశానికి మంత్రి గుడివాడ అమర్‌నాథ్ హాజరుకానున్నారని పేర్కొన్నారు. సమావేశానికి సంబంధించిన సమాచారాన్ని ఇప్పటికే సభ్యులకు తెలియజేశామన్నారు. అధికారులంతా తమశాఖల ప్రగతి నివేదికలతో సిద్ధంగా సమావేశానికి హాజరుకావాలని సూచించారు.

క్షయ వ్యాధి నివారణపై అవగాహన



కశింకోట పీహెచ్‌సీ సిబ్బంది ఆధ్వర్యంలో క్షయ వ్యాధి నివారణపై అవగాహన ర్యాలీ

కశింకోట : ప్రపంచ క్షయ వ్యాధి నివారణ దినోత్సవాన్ని పురస్కరించుకుని స్థానిక పీహెచ్‌సీ వైద్య, ఆరోగ్య సిబ్బంది శుక్రవారం ర్యాలీ నిర్వహించారు. వైద్యాధికారి తిరుపతిరావు మాట్లాడుతూ క్షయ వ్యాధిగ్రస్తుని నోటి తుంపరలు గాలి ద్వారా ఆరోగ్యవంతుల్లో చేరి వ్యాధికి కారణమవుతాయన్నారు. దీని దృష్ట్యా క్షయ వ్యాధిగ్రస్తులు తప్పనిసరిగా మాస్కు ధరించాలన్నారు. పోషకాహార లోపం ఉన్న ముసలివారు, పిల్లలు, వివిధ వ్యాధులతో బాధపడుతున్న వారికి క్షయ వ్యాధి వచ్చే అవకాశం ఉందన్నారు. కార్యక్రమంలో ఆరోగ్య విస్తరణ అధికారులు సత్యనారాయణ, మురళీకృష్ణ, రామ్మూర్తి, ఆరోగ్య సిబ్బంది, ఆశ కార్యకర్తలు పాల్గొన్నారు.